(వనితాజ్యోతి మినీ కథల పోటీలో మూడవ బహుమతి పొందిన కథ)

''డాక్టరు గారేమన్నారండీ...'' కన్సల్టింగ్ రూంలోంచి బయటకు వస్తున్న భర్తకు ఎదురెళ్ళి ఆ(త్రుతగా అడిగింది హేమ. సాగర్ ఆమె మొహంలోకి చూశాడు. ముక్కూ, మొహం తెలియని పిల్లాడి గురించి భార్య పడుతున్న ఆందోళన చూసి, అంతటి సహృదయురాలు తన భార్య అయినందుకు అతని హృదయం ఆనందంతో పొంగిందో క్షణం.

ఆ వెంటనే డాక్టరు చెప్పిన మాటలు గుర్తొచ్చి మనసంతా చేదు మింగినట్టనిపించింది. ''దెబ్బలు బాగా తగిలాయి హేమా! ముఖ్యంగా కుడికాలుకి. వెంటనే ఆపరేషన్ చేయకపోతే కాలు తీసేయాల్సొస్తుంది అంటున్నారు డాక్టరు'' అతని మాటలు వినగానే హేమకి గుండాగినంత పనయింది.

ఆమేదో అనబోయింది. ఇంతలో ఓ నడి వయసు (స్త్రీ పరుగెత్తుకుంటూ వాళ్ళిద్దరి మధ్య కొచ్చింది. ''బాబూ! ఇక్కడో యాక్సిడెంట్ అయిన అబ్బాయిని చేర్చారట — ఎక్కడ బాబూ?'' ఆమె పరుగెత్తుకుంటూ వచ్చినందు వలన ఆయాసపడుతూనే గుక్క తిప్పకోకుండా అడుగుతోంది. ఆందోళన, అలసట రెండూ కలిసి ఆమె శరీరాన్ని చెమటతో తడిసిపోయేలా చేస్తున్నాయి. రేగిన జుట్టు, మాసిన చీర, ఇంట్లో ఎలా వున్నదలా పరుగెత్తుకొని వచ్చినట్టుంది.

ఆమెని చూడగానే ఆ కు(రాడి తల్లని అర్థమైపోయింది సాగర్, హేమలకి. సాగర్‌కి ఆమెని ఇదివరకెప్పుడో, ఎక్కడో చూసినట్టు కూడా అనిపించింది. అయినా ఆమె ఆరాటాన్ని చూశాక అతను మరోమాటకు ఆస్కారమివ్వకుండా ''రండి'' అంటూ ముందుకు నడిచాడు. ఆమె పరుగులాంటి నడకతో అతన్ని అనుసరించింది. ఆ వెనుకే హేమ...

బెడ్ మీద వంటి నిండా కట్లతో ని(స్త్రాణంగా పడుకొని వున్న కొడుకుని చూడగానే ఆమె ఒక్కసారిగా గొల్లుమని ''చిన్నా'' అంటూ... ఆ పిల్లాడి మీద పడబోయింది. అది ముందే ఊహించినవాడిలా సాగర్ చటుక్కున ఆమెని పట్టుకున్నాడు.

''చూడమ్మా! మీకు బాధ వుండొచ్చు కాదనను. కాని మిమ్మల్నిలా డాక్టరుగారు చూశారంటే అసలు బాబు దగ్గరకే రానీరు'' అన్నాడు.


అంతే! ఆమె టక్కున ఏడుపు మానేసింది. కలువుగుడ్లేసుకుని చేష్టలుడిగినదానిలా కొడుకు వైపు చూస్తుండిపోయింది. అప్పుడు ఆమెనేం అడిగినా చెప్పలేదనే ఉద్దేశంతో సాగర్, హేమ మౌనంగా వుండిపోయారు. ఆమె కొంచెం తేరుకున్నాక... మితపడ్డాక నిదానంగా చెప్పాడు సాగర్, బాబుకి తగిలిన దెబ్బల గురించి, కుడి కాలుకి ఆపరేషన్ గురించి.

అతను చెప్పింది విన్నాక ఆమె మొహంలో చెప్పలేని బాధతోపాటు ఏదో నిర్లిప్తభావం కూడా కనిపించింది. సాగర్ వెంటనే అనుమానంగా ''నీ కెవరూ లేరామ్మా'' అన్నాడు. ఈసారామె నిజంగానే నిర్లిప్తంగా నవ్వింది. ''ఎందుకు లేరు బాబూ! వీడికి పైన, దాదాపు నీ వయసున్న కొడుకున్నాడు. వాడో స్వార్థపరుడు. వాడికి తన భార్యా, పిల్లలు తప్ప మేమక్కర్లేదు.

వీడి తం(డి బతుకుతెరువు కోసం ఊళ్ళు పట్టి తిరుగుతున్నారు. ఇప్పుడు ఆయనొచ్చే వరకు నేను దిక్కులేనిదాన్నే!'' సాగర్, హేమ లకి ఆమె పరిస్థితి జాలనిపించింది. ఆమె చెప్పింది విన్నాక సాగర్‌కి ఏం చేయాలో తోచ లేదు. (ప్రస్తుతం తన దగర కూడా ఆపరేషన్‌కి సరిపడా డబ్బు లేదు. పోనీ ఎవరయినా తెలిసిన వాళ్ళ దగ్గర తేవడానికైనా తనీ ఊరికి కొత్త. అంత డబ్బు ఎవరిస్తారు తనకి?

కాని ఏదో ఒకటి చేయకపోతే ఆ బాబు జీవితాంతం అవిటివాడుగా బతకాల్సొస్తుంది! మంచానికి తల ఆన్చి ఏడుస్తోందామె! సాగర్ ఆమె పక్కన మోకాళ్ళ మీద కూర్చుంటూ ''చూడమ్మా! మీరిప్పుడు ఏడిస్తే లాభం లేదు. మీ కొడుకు ఎలాంటివాడైనా ఇలాంటి పరిస్థితిలో ఆదుకోకపోడు. మీరు వెళ్ళి అతన్ని పిలుచుకు రండి. నేను మాట్లాడుతాను'' అన్నాడు నచ్చ చెబుతున్నట్టుగా!

ఆమె తలెత్తి సాగర్‌ని చూసింది. ఆమె



మొహంలో స్పష్టంగా కనబడుతోంది వెళ్ళడానికి అయిష్టత! అయినా తప్పదన్నట్టుగా ఓసారి బాబు వైపు చూసి బయల్దేరింది. సాగర్, హేమ భారంగా నిట్టూర్చారు. మరో పావుగంటలో గోడకు కొట్టిన బంతిలా తిరిగొచ్చిందామె.

కట్టలు తెంచుకున్న వరద గోదారిలా వుందామె దుఃఖం. కన్నకొడుకుని కాపాడుకోలేని నిస్సహాయత ఆమెలో కరిగి కన్నీరై ప్రవహిస్తోంది. సాగర్, హేమ నిశ్చేష్టులై చూస్తుండగానే ఆమె చెప్పడం ప్రారంభించింది ఏడుస్తూనే. "ముందే చెప్పానుగా బాబు. కొడుకు గురించి ఏ తల్లికి తెలియదు? వాడ్ని అంత స్వార్థపరుడిలా పెంచింది నేనే బాబు. అందుకు ఫలితం అనుభవిస్తున్నాను. వాడి ఉద్యోగం కోసం నా మెళ్ళో మంగళ సూత్రం అమ్మాను బాబూ...! ఇప్పుడు వాడు..." ఆమె కొడుకు మీద కోపంతో, ఆవేశంతో తనెక్కడుందో మరచిపోయి పెద్దగా అరుస్తోంది. హేమ అతికష్టం మీద ఆమె నాపగలిగింది.

సాగర్ ఆలోచన "మంగళసూత్రం అమ్మి" అన్న ఆమె మాట దగ్గరే ఆగిపోయింది. అతను సాలోచనగా హేమ మెడ వైపు చూశాడు. తనకి వాళ్ళ అమ్మా, నాన్న పెట్టిన ఒకే ఒక్క నగ అది. భర్త చూపుల్ని గమనించింది హేమ. మాటల్లో పెట్టలేని ఆ చూపుల భావం కూడా గ్రహించిందామె. "మీరు చూస్తుండండి. నేనింటికెళ్ళి ఇప్పుడే వస్తాను" అని పరుగులాంటి నడకతో బయటకెళ్ళిందామె.

మరో పది నిమిషాలలో మెడలో పసుపు తాడుతో వచ్చిన హేమ మంగళసూత్రం తాడుని సాగర్ చేతిలో పెట్టింది. మరో రెండు గంటల్లో బాబు కాలుకి ఆపరేషన్ జరిగింది. సాగర్, హేమ మొహాల్లో చెప్పలేనంత సంతృప్తి. వాళ్ళిద్దరి పట్ల కృతజ్ఞతా భావంతో గుండె నిండిపోయి గొంతు మూగబోయిందామెకి!

తరువాత రోజు ఉదయం వచ్చాడామె భర్త. అతను కొడుకుని చూసుకున్నాక ఆమె సాగర్, హేమల గురించి తడితో మెరుస్తున్న కళ్ళతో చెప్పింది. ఆయన సాగర్ రెండు చేతులు పట్టుకున్నాడు. తనకెలా కృతజ్ఞత తెలుపుకోవాలో తెలియక సతమతమవుతున్న ఆయన మొహంలోకి చిరునవ్వుతో చూసిన సాగర్, క్షణం పాటు స్తంభించిపోయాడు.

అతని హృదయంలో మరపు పొరల అడుగున గాఢంగా ముద్రింపబడివున్న ఓ రూపం. ఆ పొరలన్నీ చీల్చుకుని బయటకు వచ్చి కళ్ళకు కట్టినట్టు కనబడుతోంది. అతని హృదయాంతరాళాలలో ఆనందం, ఆవేదన కలిసిన ఓ ఉద్విగ్న భావం!

మరో నిమిషం తరువాత ఏదో లోకంలో వున్నవాడిలా నెమ్మదిగా "నాన్నా!" అన్నాడు సాగర్. అందరూ నిశ్చేష్టులై అయోమయంగా చూశారు సాగర్‌ని. "నేను నాన్నా! సాగర్‌ని!" అతనా మాట అనగానే ఆయన ఒక్కసారిగా సాగర్‌ని గుండెలకి హత్తుకున్నాడు. "బాబు సాగర్! ఎక్కడున్నావురా ఇన్నాళ్ళు? నిన్ను ఎవరికో పెంచుకోడానికిచ్చేశానని ఈ నాన్న మీద అలిగావా నాన్నా?"

ఆయన ఆనందంతో ఊగిపోతూ అంటుంటే, సాగర్ ఆయన భుజాల మీంచి ఆమెని చూస్తూ "పిన్నీ!" అన్నాడు. స్వచ్ఛంగా, నిర్మలంగా నవ్వుతున్న సాగర్ కళ్ళలోకి చూడలేక ఆమె తల నేలలోకి వంగిపోయింది.

"ఇదుగో! దీనివల్లే బాబూ, బంగారంలాంటి నిన్ను దూరం చేసుకున్నాను. అందుకు తగిన శిక్ష ఇప్పుడు అనుభవిస్తున్నాంరా!" సాగర్ తండ్రి కోపంగా భార్యని చూస్తూ అన్నాడు. భర్త మాటలతో పశ్చాత్తాపంతో దహించుకుపోతున్న ఆమె హృదయం బద్దలైన అగ్నిపర్వతమే అయింది.

"సాగర్! నన్ను క్షమించు బాబూ! ఈ సవతి తల్లి మీద ఇంకా ప్రేమ చూపిస్తున్నావా? నీ పట్ల నేనో రాక్షసిలా ప్రవర్తించాను బాబూ, నిన్ను మా అన్నయ్య పెంచుకుంటానన్నాడని మీ నాన్నతో అబద్ధం చెప్పి, మా అన్నయ్యకిచ్చి అనాథాశ్రమంలో చేర్పించమన్నాను. ఆ తరువాత నువ్వు వాళ్ళింట్లోంచి పారిపోయావని మీ నాన్నకి అబద్ధం చెప్పి నమ్మించాను. చివరికి నిన్నో అనాథని చేశాను తండ్రీ!" ఆమె గుండెల్లోని ఆవేదనని కన్నీళ్ళ ద్వారా తీర్చుకుంటోంది. సాగర్ ఆమె దగ్గరగా వచ్చి ఆమె కన్నీళ్ళు తుడిచాడు.

"లేదు పిన్నీ! నేను అనాథను కాను. అదృష్టవంతుడ్ని! నేనీ లోకాన్నే కన్నతల్లిలా ప్రేమించగలిగిన అదృష్టవంతుడ్ని! తమ్ముడని తెలియక ముందే చిన్నాలో తమ్ముడ్ని చూడగలిగిన అదృష్టవంతుడ్ని..." అతని మాటలు ఆ నాలుగు గోడలు దాటి విశాల ప్రపంచంలో ప్రతిధ్వనిస్తున్నాయి!

